సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 24 । మార్చి । 2024




క్షయను జయిస్తున్నారు

జిల్లాలో ఐదేళ్లలో 15,287 మంది క్షయ బారిన పడగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో వీరిలో 15,263 మంది పూర్తిగా కోలుకున్నారు. IIలో ▸

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

అత్తిలి మండలంలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు మంత్రి కారుమూరి సమక్షంలో భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. IIలో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహరి సోమవారం (ఉదయం)
భీమవరం	6.22	4.46
ఏలూరు	6.25	4.43

న్యూస్‌రీల్

నేడు కొల్లేటికోటలో తెప్పోత్సవం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ గోపాలరావు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతర (తీర్థం) ఆదివారంతో ముగియనుంది. చివరి రోజు కోనేరులో అమ్మవారి తెప్పోత్సవానికి ఘనంగా ఏర్పాట్లుచేశారు. శనివారం ఉదయం అమ్మవారికి అష్టాదశ కలశర్చన, అష్టాదశ పీటపూజ, పత్రాసాధన హోమం, బలిహరణ, పుష్పాలంకరణ, ధూపసేవ బాలభోగం, హారతి, మంత్ర పుష్పం, సాయంత్రం పంచహారతులు అందించారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా కైకలూరుకు చెందిన బండారు అనిల్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీ కృష్ణ రాయబారం నాటకం ఆకట్టుకుంది. తెప్పోత్సవానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని ఈఓ కేవీ గోపాలరావు కోరారు.

టెన్త్ పరీక్షలకు 96 శాతం హాజరు



భీమవరంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

భీమవరం: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన భౌతికశాస్త్రం పరీక్షకు 96.57 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. 22,139 మంది విద్యార్థులకు 759 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే ఎస్ఎస్‌సీ ఏపీఓఎస్ఎస్ పరీక్షకు 778 మందికి 668 మంది, ఇంటర్మీడియెట్ ఏపీఓఎస్ఎస్ పరీక్షకు 1,646 మందికి 1,489 మంది హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదని డీఈఓ వెంకటరమణ చెప్పారు.

27,133 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 139 కేంద్రాల్లో పదో తరగతి భౌతికశాస్త్రం పరీక్షకు 24,132 మంది రెగ్యులర్ విద్యార్థులకు 23,219 మంది హాజరయ్యారు. అలాగే ఒకసారి ఫెయిలైన విద్యార్థులు 5,237 మందికి 3,078 మంది హాజరు కాగా 96.22 శాతం హాజరు నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 39 కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి 3 కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఒక కేంద్రాన్ని మొత్తంగా 43 కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. పరీక్షల్లో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

‘ఓపెన్’ పరీక్షలకు 1,775 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులకు పబ్లిక్ పరీక్షలు శనివారం ఏలూరు జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ఏడు కేంద్రాల్లో పదో తరగతి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పరీక్షకు 737 మందికి 613 మంది, 9 కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్మీడియెట్ భౌతికశాస్త్రం పరీక్షకు 545 మందికి 493 మంది హాజరయ్యారు. అలాగే రాజనీతిశాస్త్రం పరీక్షకు 752 మందికి 669 మంది హాజరయ్యారు. జిల్లాస్థాయి పరిశీలకులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ కమిటీ సభ్యులు పలు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

ఓటర్లలో చైతన్యం కోసమే స్వీప్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఓటర్లకు నమూనా ఈవీఎంలపై ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో ముమ్మరంగా స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జన సామర్థ్యం ఉండే బస్టాండ్ వంటి ప్రాంతాల్లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

1,700కు పైగా కార్యక్రమాలు

ఎన్నికల్లో అర్హులంతా ఓటుహక్కును వినియోగించుకునేలా పలు రూపాల్లో అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పటివరకు 1,700కుపైగా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు.

సాగుదారులకే దర్భరేవు భూములు

దశాబ్దాల సమస్యకు మోక్షం

- జగన్ పాలనలో నెరవేరిన రైతుల కల
- 1,485 మందికి 1,754 ఎకరాల భూముల పంపిణీ
- సొంత ఖర్చులతో ప్రభుత్వం రిజిస్ట్రేషన్
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



నరసాపురం మండలంలో దర్భరేవు కంపెనీ భూములు

నరసాపురం: నరసాపురం తీర గ్రామాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పరిష్కరించింది. బ్రిటిష్ హయాంలో లీజుకు తీసుకుని తరాలుగా అనుభవిస్తున్న సాగు భూములకు సాగు చేస్తున్న రైతులనే హక్కుదారులు చేసే బృహత్తర కార్యక్రమం పూర్తిచేయడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం మండలంలో దర్భరేవు కంపెనీ భూములను ప్రస్తుతం అనుభవిస్తున్న వారికే రూ.100 నామమాత్రపు కనీస ధరకు అప్పగించడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా ప్రభుత్వం భరించింది. ఇలా 1,754 ఎకరాలను సాగుచేసుకుంటున్న 1,485 మంది రైతులకు ప్రభుత్వం భూ పంపిణీ చేసింది.

కన్నేసిన టీడీపీ ప్రభుత్వం : 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ భూములపై కన్నేసింది. రైతులకు భూములు ఇచ్చేస్తున్నామని మభ్యపెట్టి కోట్లు దండుకుంది. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రైతుల నుంచి డబ్బుల వసూలుకు పూనుకుంది. కేబినెట్ ఆమోదం లేకుండా, నిబంధనలు పాటించకుండా అమలు సాధ్యం కాని జీఓ తీసుకువచ్చింది. ఎకరాకు రూ.1,000 నామమాత్రం ధర తీసుకుని సాగుదారులకు కంపెనీ భూముల పట్టాలిస్తామని మభ్యపెట్టింది. అయితే స్థానిక టీడీపీ నాయకులు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.50 వేల చొప్పున కోట్లాది రూపాయలు వసూలు చేశారు. అయినా రైతులకు పట్టాలు కూడా ఇవ్వలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు వద్ద జరిగిన విషయం చెప్పి బోరుమన్నారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రికి రైతుల ఆవేదన వివరించారు. అనంతరం అర్హులైన రైతులకు కంపెనీ భూములను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సమగ్ర సర్వే.. అర్హుల గుర్తింపు

కంపెనీ భూములు సాగు చేసుకుంటున్న వారిలో అర్హులను సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వం గుర్తించి, రిజిస్ట్రేషన్‌లు చేసి ఇచ్చింది. భూముల్లో అసలు సాగుదారుల ఎవరు అనే అంశంపై సమగ్ర సర్వే చేయించి భవిష్యత్‌లో రైతులకు ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా కేబినెట్ ఆమోదం చేయించి భూములను పంపిణీ చేసింది.

సీఎం జగన్ చొరవతో..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో దర్భరేవు కంపెనీ భూముల సమస్య పరిష్కారమైంది. సమస్య చెప్పగానే సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు. సర్వేకు ఆదేశాలు ఇవ్వడంతో పాటు రూ.100 కనీస ధరకు పొజిషన్‌లో ఉన్న సాగుదారులకు భూములు పంచాలని నిర్ణయించారు. నిజమైన సాగుదారులందరికీ భూములు పంపిణీ చేశాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

కంపెనీ భూముల కథేంటంటే..

1921లో బ్రిటిష్ ప్రభుత్వం నరసాపురం మండలం దర్భరేవు చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న 1,814 ఎకరాల భూమిని సాగు చేసుకునే నిమిత్తం పేదలకు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో రైతులు ది అగ్రికల్చర్ సొసైటీ కంపెనీ లిమిటెడ్ పేరుతో ఓ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కంపెనీకి 1,814 ఎకరాల భూమిని 100 ఏళ్ల లీజుకు అప్పగిస్తూ 23–07–1921న బ్రిటిష్ ప్రభుత్వం 1673 జీఓ విడుదల చేసింది. అప్పటి నుంచి వాటిని కంపెనీ భూములుగా పిలుస్తున్నారు. అయితే 1926లో బ్రిటిష్ ప్రభుత్వం సర్వే చేపట్టి కాలువలు, డ్రెయిన్ల తవ్వకం నిమిత్తం 1,814 ఎకరాల్లో 60 ఎకరాలు ప్రభుత్వానికి అవసరమని గుర్తించి తీసేసుకుంది. దీంతో మిగిలిన 1,754 ఎకరాలు రైతుల చేతుల్లో ఉన్నాయి. అప్పట్లో ఈ భూములు వ్యవసాయానికి పనికి రాకుండా అడవి మాదిరిగా ఉండేవి. తరాలుగా రైతులు కష్టపడి వ్యవసాయం చేసి వీటిని సాగు భూములుగా మార్చారు.

మేమంతా మీ వెంటే



మంత్రి కొట్టును సత్కరిస్తున్న ట్యాక్సీ ఓనర్స్, వర్కర్స్ సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయ ఏర్పాటుకు స్థలం ఇచ్చిన మిమ్మల్ని మేమెందుకు మర్చిపోతాం.. మేమంతా మీ వెంటే అంటూ తాడేపల్లిగూడెం ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ సంఘ నాయకులు డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణకు మద్దతు పలికారు. స్థానిక ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద శనివారం మంత్రి కొట్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పూలమాలలతో ఆయన్ను సత్కరించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ట్యాక్సీ యూనియన్ ఆఫీసు పెట్టుకోవడానికి కొట్టు సత్యనారాయణ అందించిన సహకారం మర్చిపోలేమన్నారు. తాడేపల్లిగూడెం అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ మంత్రి కొట్టుతోనే సాధ్యమని, మరలా ఆయన్ను గెలిపించుకుంటామని అన్నారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ గతం నుంచి అండగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వాహనమిత్ర సాయం ఏడాదికి రూ.10 వేలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ట్యాక్సీ ఓనర్స్, వర్కర్లకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కొట్టు హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



పేరుపాలెం సౌత్ గ్రామంలో ప్రచారం చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రిగా రావాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీలోని మోకావారిపాలెం, దిబ్బలపల్లవపాలెం, లైన్ పల్లవపాలెం తదితర ప్రాంతాల్లో ఆయన ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత వైఎస్సార్ కారణంగా తీర ప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందాయని, మరలా నేడు వైఎస్ జగన్‌తో చొరవతో తీర గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. జగన్ హయాంలోనే 2020లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించి రాష్ట్రంలోనే పేరు తీసుకువచ్చామన్నారు. కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీచ్‌లుగా నామకరణం చేసే భాగ్యం కలగడం తన అదృష్టమన్నారు. బీచ్‌లకు అనుసంధానంగా కోట్లాది రూపాయలతో నూతనంగా రహదారులను నిర్మించామన్నారు. కేపీపాలెం బీచ్‌లో రూ.కోటితో వైఎస్సార్ 20 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని, ఎన్నికల అనంతరం ప్రారంభిస్తామన్నారు. రాబోయే రోజుల్లో అందరి సహకారంతో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటేసి జగనన్నను, తనను గెలిపించాలని ముదునూరి ఓటర్లను అభ్యర్థించారు.

ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ కెమిస్ట్రీ, హిస్టరీ జవాబుపత్రాల మూల్యాంకనం ఈనెల 26 నుంచి ప్రారంభించాల్సి ఉండగా ఇంటర్మీడియెట్ విద్యా మండలి కార్యదర్శి ఆదేశాల మేరకు ఈనెల 25న సోమవారం నుంచే ప్రారంభించనున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు ప్రకటనలో తెలిపారు. మూల్యాంకన శిబిరం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందన్నారు. ఏలూరు జిల్లాలోని ప్రతి కళాశాల నుంచి కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టులకు నియమించిన ఎగ్జామినర్లను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తప్పనిసరిగా ఈ శిబిరానికి హాజరయ్యేలా రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఎగ్జామినర్లు సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. అలాగే కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టులకు స్క్రూటినైజర్స్‌గా నియమించిన సిబ్బందిని సైతం సదరు శిబిరంలో ఈనెల 26న మంగళవారం రిపోర్ట్ చేయాలని సూచించారు. రిపోర్ట్ చేయని ఒక్కో ఎగ్జామినర్‌కు రోజుకు రూ.1,000 చొప్పున కళాశాల యాజమాన్యానికి జరిమానాగా విధించాలని పేర్కొన్నారు.

పాలకొల్లులో గెలిచి కానుకగా ఇద్దాం



వద్దిపర్రులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పోడూరు: పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేను గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా ఇద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి పిలుపునిచ్చారు. శనివారం ఆయన వద్దిపర్రు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఆశీస్సులతో, నియోజకవర్గ ప్రజల దీవెనలతో అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను అన్నివర్గాల ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అంకితభావంతో ప్రజలకు, నియోజకవర్గానికి సేవలందిస్తానన్నారు. గత ఐదేళ్లలో సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారంతా రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమనీ, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలన అందిస్తామని గోపి ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, మండల కన్వీనర్ పితాని చిన్నా, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ డీటీడీసీ బాబు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

భీమవరంలో రూ. 100 కోట్లతో అభివృద్ధి



భీమవరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేశానని, తనకు మరోమారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత 58 నెలల్లో రూ.100 కోట్లతో పట్టణంలో వార్డువార్డునా అభివృద్ధి చేశామని, వాటిని చూసి ఓట్లు వేయాలని కోరారు. గత పాలకుల హయాంలో జరిగిన పనులు.. ఇప్పుడు జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. పట్టణంలోని 39 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా తాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధితో పాటు మరోపక్క సంక్షేమాన్ని సీఎం జగన్ అందిస్తున్నారని, భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో రాష్ట్రస్థాయిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దారన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రైల్వేశాఖ సహకారంలో అండర్ టన్నెల్స్ నిర్మాణం పూర్తి చేయించామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని అన్నారు. మరోమారు జగన్ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో భీమవరం అభ్యర్థిగా తనను, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు



ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: సంక్షేమంలో కమీషన్ల కోసం జన్మభూమి కమిటీలు కోరలు చాచి చూస్తున్నాయని, ఆదమరిచి చంద్రబాబు మాటలు నమ్మితే బలికావడం ఖాయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంట మండలం కందరవల్లి, కరుగోరుమిల్లిలో ఆయన విస్తృత ప్రచారం చేశారు. చంద్రబాబు పాలనలో ప్రతి పథకానికి జన్మభూమి కమిటీల ప్రమేయం లేనిదే లబ్ధిదారుల ఎంపిక జరిగేది కాదన్న వాస్తవం ప్రజలకు తెలుసునన్నారు. అలాగే అప్పట్లో ప్రతి అభివృద్ధి పనిలోనూ ప్రజాప్రతినిధి కమీషన్లు తీసుకొనేవారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పారదర్శకంగా సంక్షేమాన్ని పేదలకు అందిస్తున్నామని, అలాగే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కమీషన్ల కోసం కక్కుర్తి పడలేదన్నారు. దీనికి తార్కాణం నాణ్యతగా నిలిచిన అభివృద్ధి పనులే అన్నారు. పారదర్శక పాలన కోసం సీఎం జగన్‌కు అండగా నిలవాలని ఆయన కోరారు. కందరవల్లి, కరుగోరుమిల్లిలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు ప్రజలు నీరాజనం పలికారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణి, వలంటీర్ నియోజకవర్గ కన్వీనర్ కర్రి అనురాధా, కార్పొరేషన్ డైరెక్టర్లు బొక్కా అరుణ, పోతుమూడి రామచంద్రరావు, అందే నాగ బసవన్న, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు



మంచిలిలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: రాష్ట్రంలో కుల, మత, పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం వల్లే గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి దమ్ముగా ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని మంచిలి, కంచుమర్రు, స్కిన్నెరపురం, కొమ్మర, ఈడూరు, పాలూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో అధికారంలోకి తీసుకురావడానికి సమన్వయంతో పనిచేయాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధి వివరించాలని పిలుపునిచ్చారు. మరలా జగన్ సీఎం అయితే మరిన్ని పథకాలు అమలు చేస్తారన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల సొమ్మును టీడీపీ నాయకులు దోచుకున్నా రని విమర్శించారు. ఈసారి ఎంతమంది కలిసి వ చ్చినా సీఎం జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీషా, సర్పంచ్‌లు చింతా రామ య్య, అద్దాల భానులలిత మహాలక్ష్మి, మంతెన రా మలింగరాజు, తానుకొండ దయామణి, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో కట్టుదిట్టంగా కోడ్ అమలు

కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ అజిత

భీమవరం: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) ఉల్లంఘనలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన చర్యలపై ఎస్పీ వేజెండ్ల అజితతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, కోడ్ ఉల్లంఘనపై నమోదైన కేసుల వివరాలను రోజూ ఈసీఐకి నివేదిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 41 ఫిర్యాదులు అందగా 29 ఫిర్యాదులను పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు.

రూ.19.25 లక్షల సీజ్ : జిల్లాలోని పాలకొల్లు నియోజవర్గంలో చించినాడ, ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం, భీమవరం నియోజకవర్గంలో లోసరి, ఉండి నియోజకవర్గంలో దుంపగడప, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పెదతాడేపల్లి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటివరకు రూ.19.25 లక్షల నగదు సీజ్ చేశామన్నారు. ఎన్నికల ప్రచార బహిరంగ సభలు, ప్రార్థనా ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ఎన్‌కోర్ అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రచారం, సభల కోసం వివిధ రాజకీయ పార్టీల నుంచి 101 దరఖాస్తులు అందగా వాటిలో 95 దరఖాస్తులకు అనుమతులను మంజూరు చేశామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద ఇప్పటివరకు 11 మంది వలంటీర్లను తొలగించామన్నారు. వలంటీర్లు విధి నిర్వహణపై ఇంకా స్పష్టమైన ఆదేశాలు సీఈసీ నుంచి అందాల్సి ఉందన్నారు.

4 వేల బైండోవర్ కేసులు

ఎస్పీ అజిత మాట్లాడుతూ సామాన్యులు సైతం స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం ఏర్పాట్లకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగు కేంద్రాలపై నిఘా పెట్టామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన తదితరాలపై ప్రజలు స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇప్పటివరకు 4 వేల బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులపై అప్రమత్తం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని, ఎన్నికల ప్రచారానికి విధిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, మీడియా చేపట్టాల్సిన నిబంధనలపై వివరించారు. వాట్సాప్ నంబర్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. సోషల్‌మీడియా, యూ ట్యూబ్‌లో పోస్టులు, ప్రసారాలపై ప్రత్యేకంగా పోలీసు నిఘా ఉంటుందన్నారు.

క్షయను జయిస్తున్నారు

దేశంలో దీర్ఘకాలిక రోగాలలో ప్రధానమైనది క్షయ. ఇది అంటు వ్యాధి. మైకోబాక్టీరియా లేదా మైకోబ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ఊపిరితిత్తులకు సంబంధించినది అయినా చర్మం నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వ్యాధి వ్యాపిస్తుంది. జిల్లాలో గడిచిన ఐదేళ్లలో 15,287 మంది ఈ వ్యాధి బారిన పడగా, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల వీరిలో 15,263 మంది పూర్తిగా కోలుకోవడం విశేషం. ఆరోగ్య కార్యకర్తలు రోగుల ఇళ్లకు వెళ్లి వారితో మందులను వేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నయమవుతోంది. ఆదివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా కథనం..

- 9 నెలల కోర్సు మందులతో వ్యాధి నయం
- ఉచితంగా మందులు, పోషకాహారం పంపిణీ
- 2025 నాటికి వ్యాధి రహిత సమాజమే లక్ష్యం
- సత్ఫలితాలనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- సకాలంలో చికిత్సతో కోలుకుంటున్న రోగులు
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం


భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలోని టీబీ సెంటర్

భీమవరం (ప్రకాశం చౌక్): క్షయ (టీబీ) వ్యాధిని పూర్తిగా సమాజం నుంచి దూరం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో బాధ్యతగా వ్యవహరించి వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, పౌష్టికాహారం తీసుకోవడానికి ఆర్థికం సాయం అందిస్తున్నాయి. ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా బాధితులు వ్యాధిని జయిస్తున్నారు. ఈ వ్యాధి సోకినవారికి ఎండీఆర్ (మల్టీ డ్రగ్ రెసిడెన్సియల్) చికిత్సను ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది.

లక్షణాలు ఇవే

- రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడడం
- ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం,
- రాత్రి వేళల్లో తరచూ జ్వరం వస్తుంటే టీబీ లక్షణాలుగా గుర్తించాలి.

వ్యాధి నిర్ధారణ

కళ్లె పరీక్ష, ఎక్స్‌రే, ఆర్టీపీసీఆర్, సీబీ న్యాట్ పరీక్షల ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారణ చేస్తారు. హెచ్ఐవీ ఉన్నవారు, పొగ తాగేవారు, మద్యపానం, రక్తహీనత, సుగర్ వ్యాధి, ఇతర చెడు అలవాట్లు ఉన్నవారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. అలాగే వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా నోటి తుంపరులు ఇతరులపై పడడం వల్ల కూడా ఈ వ్యాధి సోకుతుంది.

ఉచిత పరీక్షలు

ఏరియా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా టీబీ సెంటర్లను నిర్వహిస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 14 (ఆర్టీపీసీఆర్ సెంటర్లు) టీబీ నిర్ధారణ, చికిత్స అందించే సెంటర్లు ఉన్నాయి. తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, పెనుగొండ, నరసాపురం, ఆచంట, ఆకివీడు, లంకలకోడేరు, గణపవరం, భీమవరం, కాళ్ల, అత్తిలి, మంచిలి, ఉండి తదితర సెంటర్లల్లో టీబీ నిర్ధారణకు ఉచిత పరీక్షలు, వ్యాధిగ్రస్తులకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ చేసేందుకు వినియోగిస్తున్న సీబీ న్యాట్ పరీక్ష పరికరాలు తాడేపల్లిగూడెం, భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి.

జిల్లాలో టీబీ పరీక్షలు, బాధితుల వివరాలు

సంవత్సరం	చేసిన పరీక్షలు	నిర్ధారణ అయిన కేసులు	కోలుకున్న వారి సంఖ్య
2019	34,910	3232	3228
2020	22,794	2129	2125
2021	32,494	3243	3240
2022	30,993	3358	3350
2023	39,803	3325	3320

మందులు, ఆర్థిక సాయం

టీబీ వ్యాధి రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ఉపరితిత్తులకు సోకేది. రెండోది ఇతర భాగాలకు సోకేది. టీబీ సోకిన బాధితులకు మందులు 9 నెలల నుంచి 18 నెలల వరకు కోర్సు ఉంటుంది. ప్రభుత్వం నెలా నెలా బాధితులకు మందులను ఉచితంగా అందిస్తోంది. అలాగే వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసుకోవడానికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.500 ఆర్థిక సాయాన్ని చికిత్స పూర్తయ్యే వరకు అందిస్తోంది. జిల్లాలో గడిచిన ఐదేళ్లలో 15,287 మంది ఈ వ్యాధి బారిన పడగా, వీరిలో 15,263 మంది పూర్తిగా కోలుకున్నారు. అలాగే జిల్లాలోని పరిశ్రమల యజమానులు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నాయి.

ఇళ్లకు వెళ్లి మందులిస్తాం



క్షయ వ్యాధి హెచ్ఐవీ, పొగ తాగేవారికి, షుగర్ వ్యాధి, రక్తహీనత, మద్యపానం ఇతర చెడు అలవాట్లు ఉన్న వారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. సీబీ న్యాట్ వైద్య పరికరం ద్వారా, ఎక్స్‌రే ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ చేస్తాం. ప్రభుత్వం ఖరీదైన మందులను 6 నెలల నుంచి 18 నెలలు వరకు అందిస్తుంది. ఆరోగ్య కార్యకర్తలే బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి మందులు వాడిస్తారు. పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పిస్తారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, మందులు వాడటం ద్వారా వ్యాధి సులువుగా నయం చేసుకోవచ్చు.

– డాక్టర్ భానునాయక్, జిల్లా క్షయ నివారణ అధికారి, భీమవరం


వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందించే మందులు

క్లుప్తంగా

ఏలూరులో 'అనన్య' చిత్ర బృందం సందడి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హీరో జయరాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అనన్య చిత్ర బృందం శనివారం నగరంలో సందడి చేసింది. తొలుత నగరంలోని సాయి బాలాజీ థియేటర్లో సినిమా హీరోహీరోయిన్లు ప్రేక్షకుల ఎదుట ప్రత్యక్షమై వారి అనుభూతులను పంచుకున్నారు. చిత్రం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సినిమా హీరో జుత్తిగ జయరాం మాట్లాడుతూ అనన్య సినిమా కుటుంబ సభ్యులందరినీ అలరిస్తుందన్నారు. సినిమాలో హర్రర్, ప్రేమ తదితర అంశాలతో పాటు కామెడీ కూడా ఆకట్టుకుంటుందన్నారు. హీరో సుమన్ ముఖ్య పాత్రలో పోషించారని, జబర్దస్త్ కమెడియన్లు ఇందులో మంచి పాత్రలు పోషించారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరిగిందన్నారు. దర్శకుడు బొమ్మిడి ప్రసాద్ రాజుతో పాటు నిర్మాతలు గంగాధర్ శర్మ పలువురు ఏలూరు జిల్లాకు చెందిన వారని తెలిపారు. సినీ ప్రేక్షకులు, అభిమానులు సినిమాను చూసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. హీరోయిన్ చందన మాట్లాడుతూ సినిమాలో బంధుత్వాలు, బాంధవ్యాలుతో కూడిన ప్రేమ, హర్రర్ అంశాలు అన్నీ ఉన్నాయన్నారు. అనంతరం హీరో జయరామ్‌ను సత్కరించారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు


కంచుమర్రులో వైఎస్సార్ సీపీలోకి చేరినవారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


కొమ్మరలో మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఇతర పార్టీల నాయకులు

అత్తిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం మంచిలి, కంచుమర్రు కొమ్మర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేయని అక్రమాలు, నేరాలు ఎవరూ చేసి ఉండరన్నారు. వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రాన్ని చదువుల రాష్ట్రంగా మార్చారని, 16వ స్థానంలో ఉన్న విద్యరంగాన్ని దేశంలోనే మొదటి స్థానానికి తీసుకువచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేశారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా రాష్ట్రంలో విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలనే మంచి సంకల్పంతో చదువులకు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు, కొమ్మర ఉప సర్పంచ్ మన్యం దానారావు, కంచుమర్రు గ్రామ పార్టీ అధ్యక్షుడు పి.వెంకటపతిరాజు, నాయకులు కోరుకొల్లు వెంకట్రావు, రంభ సూరిబాబు, కంకటాల సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, సత్తి గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో క్షుణ్ణంగా విచారణ జరపాలి


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : విశాఖలో డ్రగ్స్ దందా వ్యవహారంలో చంద్రబాబు, లోకేష్, వారి సామాజిక వర్గానికి చెందిన వారిని క్షుణ్ణంగా విచారణ చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ డ్రగ్స్ తెచ్చిన వారు చంద్రబాబుకు, పురందేశ్వరీలకు కావాల్సిన వారన్న సమాచారం వచ్చిందన్నారు. ఎన్నికలలో మద్యం పంచే స్థాయి నుంచి డ్రగ్స్ పంచే స్థాయికి టీడీపీ నాయకులు వచ్చారని ఎద్దేవా చేశారు. డ్రగ్స్ బండారం బయటపడటంతో ఎల్లో మీడియాలో వైఎస్సార్ సీపీ నాయకులపైన, సీఎంపైన విషం కక్కడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌మీనా ఈ విషయంలో క్షుణ్ణంగా విచారణ, సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

సబ్బేవానిపేటలో పట్టపగలు చోరీ

పాలకొల్లుసెంట్రల్: మండలంలోని యాళ్లవాని గరువు పంచాయతీ సబ్బేవాని పేటలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సబ్బేవాని పేటకు చెందిన జె.దుర్గ, ఆమె భర్త ఈశ్వరరావు పాలకొల్లులోని ఓ ప్రైవేటు బట్టల షాపులో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం షాపునకు వెళ్లే హడావుడిలో ఇంటికి తాళాలు వేసి పక్కనే ఓ మూలన పెట్టి వెళ్లిపోయారు. మధ్యాహ్నం దుర్గ భోజనానికి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుగా లోనికి వెళ్లి చూడగా, ఏడు కాసుల బంగారం, 20 తులాల వెండి పట్టీలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

పాలకొల్లు సెంట్రల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కొండేటి వరప్రసాద్ ద్విచక్రవాహనంపై పాలకొల్లు నుంచి పూలపల్లి వైపు వెళుతుండగా పాలకొల్లు మండలంలోని అరట్లకట్ట గ్రామానికి చెందిన ఎం.అఖిలేష్, డి.జాన్‌వెస్లీ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై పాలకొల్లు వస్తున్నారు. పట్టణంలోని రైల్వేగేటు సెంటర్ లజపతిరాయ్‌పేట యూనియన్ బ్యాంకు వద్ద శనివారం సాయంత్రం ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వరప్రసాద్, అఖిలేష్‌లకు తీవ్ర గాయాలు కాగా, జాన్ వెస్లీకి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాటు తుపాకీ స్వాధీనం

కైకలూరు: లైసెన్సు లేకుండా ఆయుధాలను కలిగి ఉంటే కేసులు నమోదు చేస్తామని రూరల్ ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. వదర్లపాడు రైల్వేగేటు సమీపంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన పడియ తలియాన చక్రపాణి చేపల చెరువులపై పిట్టలను కాల్చడానికి నాటు తుపాకీని శనివారం తీసుకువెళుతుండగా, గమనించిన రూరల్ ఎస్సై అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

కుక్కునూరు: వేలేరులో సారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ డీఎస్పీ కె జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. దాడులలో 5,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఈబీ సీఐ సునీల్‌కుమార్, ఎస్సైలు నరసింహారావు, పూర్ణ, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు టెన్నిస్ టోర్నీ ఫైనల్స్


65+ విభాగంలో తలపడుతున్న జి.వెంకట సన్యాసిరాజు

భీమవరం : భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం హోరాహోరీగా జరిగిన సెమీ ఫైనల్స్‌లో విజయం సాధించిన క్రీడాకారులు ఆదివారం జరగనున్న ఫైనల్స్‌కు చేరారు. 64+, 75+ డబుల్స్ విభాగాల్లో ఫైనల్స్ నిర్వహించి, విజేతలను ప్రకటించారు. శనివారం జరిగిన పోటీల వివరాలు ఇలా ఉన్నాయి.

35+ విభాగంలో : విజయ్ వరమ్‌పై డాక్టర్ ఎస్.పట్నాయక్ 1-6, 1-6 స్కోర్‌తో, ఈశ్వర్ సాయిపై ఎన్‌డీ విజయ్ ఆనంద్ 4-6, 4-6 స్కోరు తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరారు.

45+ విభాగంలో : సుబ్రహ్మణియన్ గోపాలకృష్ణన్‌పై ఆర్.మణి కన్నన్ 2-6, 2-6 స్కోరుతో, బీ.ఎల్ శ్రీనివాసరావుపై కె.వెంకట నారాయణమూర్తి 6-7, 4-7, 3-6 స్కోరుతో తేడాతో గెలుపొందారు.

55+ విభాగంలో : ఎస్.బెహరాపై డి.హేమంత్ కుమార్ 3-6, 2-6 స్కోరుతో, డి.సుధాకర్ రెడ్డిపై బీజీ నగేష్ 6-3, 4-6, 5-10 స్కోరుతో విజయం సాధించారు.

65+ విభాగంలో : జి.వెంకట సన్యాసిరాజుపై బి.శ్రీనివాసరెడ్డి 1-6, 0-6 స్కోరుతో, 70+ విభాగంలో టి.సుందర్ వడివేలుపై ఎస్.సేతు 0-6, 0-6 స్కోరుతో గెలుపొందారు.

65+ డబుల్స్ విభాగంలో : నిర్వహించిన ఫైనల్స్‌లో వి.ధనుంజయులు, ఎస్.మన్మథరావుపై జి.వెంకట సన్యాసిరాజు, వి.శ్రీనివాసరెడ్డి 6-7, 1-6 తేడాతో గెలుపొందారు.

70+ డబుల్స్ విభాగంలో : నిర్వహించిన ఫైనల్స్‌లో టి.సుందర్ వడివేలు, పీకే పట్నాయక్‌పై ఎ.రాంబాబు, ఎస్.సేతు 6-7, 0-6 స్కోరుతో విజయం సాధించారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

టి.నరసాపురం: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాలల ఏలూరు జిల్లా కన్వీనర్, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో 50 పాఠశాలలు, 10 జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాల (సాధారణ, మైనారిటీ) మొత్తం 61 విద్యాలయాలు ఉన్నాయన్నారు. ఈ పాఠశాల, కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఏప్రిల్ 25న పాఠశాల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో 'హెచ్‌టీటీపీఎస్//:ఏపీఆర్ఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్' వెబ్‌సైట్ ద్వారా పాఠశాల విద్యార్థులు రూ.100, కళాశాల విద్యార్థులు రూ.300 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి విద్యార్థులు 2022-23, 2023-24 సంవత్సరాల్లో గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు చదివి ఉండాలన్నారు. అలాగే 6, 7, 8 తరగతులకు సంబంధించి మిగిలిన సీట్లకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదుతున్న గ్రామీణ ప్రాంతాల ఓసీ, బీసీ విద్యార్థులు, అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ప్రవేశపరీక్ష అన్ని జిల్లా కేంద్రాల్లో ఏప్రిల్ 25న నిర్వహిస్తామన్నారు. సంబంధిత ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా వివిధ కేటగిరీల్లో నిర్దేశించిన రిజర్వేషన్ ప్రకారం ప్రవేశం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 871262 5030, 87126 25031 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం సత్యనారాయణమూర్తి, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ నిర్వహిస్తున్న లక్కీడిప్‌లో భాగంగా పట్టణంలో బస్సు కాంప్లెక్స్‌లో శనివారం లక్కీడిప్ తీసి విజేతలకు జీవీమాల్ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లుల్లో ప్రయాణం చేసినవారు టికెట్లను లక్కీ డిప్ బాక్స్‌లో వేసి విజేతలను ప్రకటించినట్లు చెప్పారు. లక్కీడిప్ కార్యక్రమంలో ప్రయాణీకులు, యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



జట్లపాలెంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి

పెంటపాడు : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్య సమతుల్యతను సాధించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి పేర్కొన్నారు. జట్లపాలెం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం పోషణ కార్యక్రమంపై గర్భిణులకు, బాలింతలకు, ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తాము తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను మండలంలోని ప్రత్తిపాడులో శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఫుడ్ ఫ్యాట్స్ ఫ్యాక్టరీ, స్వాభిమాన్ ట్రస్టుల సహకారంతో ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. బెల్లం, మిల్లెట్లు, పప్పు దినుసులు, జీడిపప్పు, బాదం తదితర పౌష్టికాహారంతో కూడిన కిట్లు ఈ సందర్భంగా పంపిణీ చేశారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యనారాయణ వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి ప్రాణాంతకం కాదని, క్రమం తప్పకుండా మందులు వాడితే ఆరు నెలల్లో నయమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయ ప్రసాద్, డాక్టర్ కీర్తి, ఫుడ్ ఫ్యాట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకుతీగపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం



ఆకుతీగపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: ఆకుతీగపాడు గ్రామంలో పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు రక్త పరీక్షలు చేశారు. ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. అనంతరం రైతుల ధాన్యం పట్టుబడిలో రైతులకు విద్యార్థులు సహకరించారు. వారం రోజులపాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రోడ్లపై చెత్తచెదాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయబాబు, కమిటీ సభ్యులు సురేంద్రబాబు, రామచంద్రుడు, అధ్యాపకులు జాన్‌బాబు, కుసుమ, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి రోగి సహకరించాలని డా.పి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బేబీ సెంటర్, అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ క్షయ రహిత సమాజం ఏర్పడటానికి అందరూ కలిసి సమైక్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ సందర్భంగా టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.కృష్ణ, గిరిబాబు, నరేష్, నాగలక్ష్మి, రాఘవ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు సీఐటీయూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

తణుకు: కార్మికులు, రైతులు సమస్యలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండటంలేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ విమర్శించారు. తణుకు ఎన్జీవో హోంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి.

సంక్షేమం, అభివృద్ధితో ప్రగతి

- గ్రామ సచివాలయ వ్యవస్థతో తీరిన ప్రజల కష్టాలు
- రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యత
- ఒక్క గ్రామానికే రూ.24.83 కోట్ల లబ్ధి



గ్రామ ఆరోగ్య కేంద్రం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి గత మూడేళ్ల పాలనలో జరుగుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ప్రతిగ్రామంలో గత ఐదేళ్లుగా రూ.2నుంచి 16కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఐదేళ్ల గ్రామాల పరిస్థితి, ఇప్పటి గ్రామాల పరిస్థితిని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మాణం చేసి ప్రతి గ్రామ సచివాలయంలో 11మంది ఉద్యోగులను నియమించి పరిపాలనను పల్లె ప్రజలు చేరువలోకి తీసుకువచ్చి సత్వర సేవలు అందిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో గ్రామాలు మినీ సెక్రటరేట్లుగా ఉన్నాయి. గతంలో కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు కావాలంటే దూర ప్రాంతంలోని మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేది. అదీ కూడా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేది. దీనితో ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో గంట వ్యవధిలోనే సొంత ఊరులోనే ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలను అందుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజల ముంగిటకు తీసుకువచ్చి వైద్యులను అందుబాటులో ఉంచారు. గ్రామ స్వరాజ్యమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నవరత్నాలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అలాగే, ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ వచ్చేలా రూపకల్పన చేసింది.



తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం

తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో 3,963 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ వంటి ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలకు వ్యయ ప్రయాసలు లేకుండా ఒకే చోట ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. అంతే కాకుండా నవ సమాజానికి ప్రతీకలుగా నిలుస్తున్న ప్రభుత్వ విద్యాలయాలను నాడు–నేడులో పూర్తి స్థాయిలో ఆధునీకరించడం జరిగింది. నవరత్నాలు ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నేరుగా లబ్ధి చేకూర్చడం జరిగింది. లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా (డీబీటీ) రూ.17,03,30,105లు, పరోక్ష పద్ధతిలో మరో రూ.5,82,22,457లు వెరసి రూ.22,85,52,562లు లబ్ధి చేకూరింది. ఇవి కాకుండా నాడు–నేడులో రూ.49,48,140లు, గడప గడపకు మన ప్రభుత్వంలో రూ.20లక్షలు, గ్రామ సచివాలయ భవనాలకు రూ.86.20లక్షలు, రోడ్లకు రూ.13,38,129లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.29.30లక్షలు వెచ్చించారు. డీబీటీ, నాన్ డీబీటీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు మొత్తంగా రూ.24,83,88,925లు లబ్ధి చేకూరింది. ఈ ఒక్క గ్రామానికే ఇంత మేర లబ్ధి చేకూరడం అతిశయోక్తి కాదు.

కుటుంబంలో ధీమా నింపిన వైఎస్సార్ బీమా



భర్త చనిపోవడంతో ఆయన పేరుమీద రూ.2లక్షల బీమా తమ కుటుంబానికి ఆసరాగా నిలిచింది. తమ ముగ్గురు పిల్లలకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తించాయి. దీంతో తమ పిల్లల విద్యాభ్యాసానికి ఎంతగానో సీఎం జగన్ మోహన్‌రెడ్డి తోడ్పాటు అందజేశారు. ఆయనే మళ్లీ సీఎం కావాలి.

– గుర్రాల సూర్యావతి, నీలాద్రిపురం, తాడేపల్లిగూడెం మండలం

శెట్టిబలిజల ఆరాధ్యుడు దొమ్మేటి వెంకటరెడ్డి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు



అత్తిలిలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: శెట్టిబలిజల ఆరాధ్యదైవం దొమ్మేటి వెంకటరెడ్డి పేదల అభివృద్ధి కోసం పాటుపడిన మహనీయుడని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఎన్టీఆర్ పార్కు ప్రాంతంలోని ఆయన విగ్రహానికి మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శెట్టిబలిజల ఐక్యతకు పాటుపడి ఆ జాతి దైవంగా కీర్తింపబడి వెంకటరెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. బర్మాలో మేయర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన దేశంలోని దేవాలయాలకు ధ్వజస్తంభాలు ఇచ్చి తన ఆధ్యాత్మికతను చాటుకున్నారని తెలిపారు. అటువంటి మహనీయుడి విగ్రహాలను తణుకు నియోజకవర్గంలో నాచేతుల మీదుగా ఏర్పాటుచేయడం అదృష్టంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పాతవూరు శ్రీరామా శెట్టిబలిజ సంఘ పెద్దలు కుడుపూడి చంద్రరావు, పిల్లి ముత్యాలు, సానబోయిన రాములు, సానబోయిన శ్రీను, పిల్లి సూరిబాబు, కొరు నాగరాజు, పంపన మురళి, పంపన సుబ్బారావు, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్, కత్తుల జెస్‌పాల్, షేక్ బాజీ పాల్గొన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి

అత్తిలి : శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో శెట్టిబలిజలు నడవాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలిలో శనివారం దొమ్మేటి వెంకటరెడ్డి 171వ జయంతిని శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అత్తిలి కెనాల్‌రోడ్డులో ఉన్న దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ సంఘ ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మండల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కముజు శ్రీను, ఉపాధ్యక్షులు కట్టా అప్పన్న, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, పెచ్చెట్టి రామకృష్ణ, బొంతు ఆంజనేయులు, బాలం ప్రసాద్, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, అనిశెట్టి త్రిమూర్తులు, దొమ్మేటి శ్రీను, బండి సత్యనారాయణ, బిఎర్ర సత్యనారాయణ, సబ్బితి రాజేష్, రాంపండు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

మంత్రి కొట్టు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. రూరల్ మండలం కొత్తూరు, నవాబుపాలెం గ్రామాల్లో కొట్టు సత్యనారాయణ శనివారం రాత్రి పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, పార్టీ మండల ప్రెసిడెంట్ జడ్డు హరిబాబు, ఆరుగొలను, కొమ్ముగూడెం, తాడేపల్లిగూడెం సొసైటీల చైర్మన్‌లు చిక్కాల సత్యనారాయణ, వెలిశెట్టి నరేంద్ర కుమార్, గుమ్మల్ల తాతారావు, ఆరుగొలను ఉపసర్పంచ్ అడపా అప్పలరాజు, ఎంపీటీసీ నార్ని శంకరావు, సొసైటీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, యువనేత కొట్టు విశాల్, ముద్దుకూరి మోహర్ ప్రసాద్, పాల్గొన్నారు.

పెంటపాడు: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. అలంపురం గ్రామంలోని కళ్లేపల్లి గాంధీరాజు స్వగృహం వద్ద శనివారం పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, గోరింట రవివర్మ, సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ దత్తుడు, పెనుమర్తి కాశీ, దెందుకూరి సూర్యనారాయణరాజు, ఎస్సీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



తణుకులో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు



గూడెంలో భగత్ సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తణుకు: దేశ స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయ సాధనకు విద్యార్థులు, యువత పోరు సాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని తణుకులో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక వెంకటకృష్ణ థియేటర్ కూడలిలో భగత్ సింగ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ఉరి కంబాన్ని ముద్దాడిన వీరులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్‌దేవ్‌లని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, నాయకులు పుట్టా అమ్మిరాజు, బొద్దాని మురళీకృష్ణ, బొబ్బిలి నాగబాబు, కోరాడ శివ, బొద్దాని కృష్ణకిశోర్, బొద్దాని అప్పారావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు యు.మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 92వ వర్ధంతిని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ప్రసాద్, అజయ కుమారి, శ్రీనివాస్, రంగారావు, కళ్యాణి, జాన్సీ, పీవీ ప్రతాప్, నాగేశ్వరావు, సత్యనారాయణ, గుబ్బల గోపి, ఎస్.ఆదినారాయణ బాబు, వల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగతసింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత పాటుపడాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. స్థానిక కపర్ది భవనంలో శనివారం భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో....

భారతమాత ముద్దు బిడ్డలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను షహీద్ దివాస్ సందర్భంగా వారిని గుర్తు చేసుకుంటూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి బాబి, ఇమ్మంది బెనర్జీ, సందక రమణ, బి.కొండయ్య తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో మళ్లీ గెలిపించుకోవాలని తాడేపల్లిగూడెం మోటారుసైకిళ్ల మెకానిక్ ఓనర్లు అండ్ వర్కర్ల సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక బలుసులమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో తాడేపల్లిగూడెం మోటారుసైకిళ్ల మెకానిక్ ఓనర్లు అండ్ వర్కర్ల సంక్షేమ సంఘం సభ్యులతో శనివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గం మంత్రి కొట్టు సత్యనారాయణ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. అదేవిధంగా మోటారుసైకిళ్ల మెకానిక్ వర్కర్లు ఓనర్లు సంక్షేమ సంఘానికి ప్రత్యేకంగా సంఘ భవనం కావాలని అందుకు సహకారం అందించాలని మంత్రి కొట్టును కోరగా ఆయన సానుకూలంగా స్పందించి స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి సహకారం అందిస్తానని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. నిత్యం తమకు అందుబాటులో ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తున్న కొట్టు సత్యనారాయణను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని మెకానిక్‌లు, సంఘ నాయకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ కొట్టు సత్యనారాయణ హయాంలో అభివృద్ధి కళ్ల ముందు కనబడుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాని అభివృద్ధిని చూసి తన తండ్రి కొట్టు సత్యనారాయణకు ఓట్లు వేసి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండు సమయాల్లోను పేదలకు సంక్షేమం అందించేందుకు అహర్నిశలు శ్రమించానని ఈ విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. గతంలో మాదిరిగానే మెకానిక్‌లకు ఎల్లప్పుడూ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అధికారం లేకపోవడంతో చంద్రబాబునాయుడు మతిస్థిమితం లేకుండా పోయిందని మంత్రి కొట్టు విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన 650 హామీల్లో ఏఒక్కటీ నెరవేర్చలేని అసమర్థుడిగా చంద్రబాబు నిలిచాడని దుయ్యబట్టారు. ఒక్కడే ఎన్నికల్లో పోటీ చేయలేక జనసేన, బిజెపీలతో కలిసి పోటీ చేస్తున్నాడని, చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రజల అభీష్టమే తనకు శిరోధార్యంగా భావిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యేగా తనకు ఓట్లు వేసి గెలిపించి మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో బొద్దాని శ్రీనివాసు, సంఘ నాయకులు కొమ్మిశెట్టి వెంకటరాజు, పసుపులేటి సత్యనారాణ, మోహన్, యేసు, పొన్నాడ సత్యనారాయణ, సోము శ్రీను, పర్వతాల పాపారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, జోగి ఏడుకొండలు, కొలుకులూరి ధర్మరాజు, కొట్టు విశాల్, బొద్దాని శ్రీనివాస్, మేడపాటి జనార్ధనరెడ్డి, రామిరెడ్డి రామారెడ్డి, కట్రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమాన్ని మ్యానిఫెస్టోలో చేర్చాలి

తణుకు టౌన్: పాత్రికేయుల సంక్షేమానికి రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో చేర్చి వాటిని నెరవేర్చాలా నాయకులు కృషి చేయాలని పలువురు ప్రతికేయులు కోరారు. శనివారం సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఐజేయూ పిలుపు మేరకు జర్నలిస్టుల కోర్కెల దినోత్సవంలో భాగంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు అందజేశారు. అనంతరం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భవానీకి వినతి పత్రాన్ని అందజేశారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్షల్లో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో టౌన్, రూరల్, పెంటపాడుల్లో ఐదోవ రోజు శనివారం ఫిజిక్స్ పరీక్ష (50 మార్కులు) ప్రశాంతంగా నిర్వహించారు. 18 సెంటర్‌ల్లో పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు జరిగాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీవైఈఓ కార్యాలయం సిబ్బంది వెల్లడించారు.

పిచ్చుకల సంరక్షణకు అందరూ కృషి చేయాలి



దండగర్ర జిల్లా పరిషత్ విద్యార్థులు తయారు చేసిన పిచ్చుక గూళ్లు

తాడేపల్లిగూడెం రూరల్: పిచ్చుకల సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని శనివారం మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఐదవ తరగతికి చెందిన విద్యార్థులు తయారు చేసిన పిచ్చుక గూళ్లు ఆకట్టుకున్నాయి. వీరిలో సీహెచ్.వరప్రసాద్, ఎస్.చేతన్, పరశురామం, ఎ.మానస, కవిత, ఎస్.లక్ష్మివైష్ణవి, ఇ.మహిమ జ్యోతి, ఎస్.సంజన, ఎస్.మణిశ్రీ ఉన్నారు. విద్యార్థులను ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం



కత్తవపాడులో బూత్‌లెవెల్ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం : పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ వెలగల సాయిబాబారెడ్డిలు కోరారు. మండలంలోని కత్తపాడు, పొదలాడ గ్రామాల్లో శనివారం బూత్‌లెవెల్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎమ్మెల్యేగా కారుమూరి వెంకట నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు మండల, నియోజకవర్గ నాయకులు దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బూత్ లెవెల్ కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, నాయకులు చింతా బాపిరెడ్డి, పెచ్చెటి పెదస్వామి, జవ్వాది సురేష్, సత్తి వెంకట రెడ్డి, కటారి రామారాజు, బొల్లా సత్యనారాయణ, గ్రామా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.